కథ

# స్టెప్ మదర్

సూర్యం వెడ్స్ కమల!

బంగారురంగు కార్డుమీద నీలంరంగు అక్షరాలు అందంగా మెరుస్తున్నాయి. వెడ్డింగ్ కార్డువంక నిర్లిప్తంగా చూస్తుండిపోయింది కమల.

కూతురి నిర్లిప్తతను క్రీగంట గమనిస్తూనే ఉంది భ్రమరాంబ.

''ఏమ్మా అలా వున్నావేం? ఒంట్లో బాగోలేదా?'' ఆప్యాయంగా ప్రశ్నించింది.

''అదేంకాదు'' ముక్తసరిగా సమాధానం చెప్పింది కమల.

''మరయితే అలా డల్‌గా వున్నావేం?'' లాలనగా అడిగింది భ్రమరాంబ.

''నేనెలా వుంటే మీకేం?'' విసురుగా సమాధానం చెప్పి అక్కడ్నుంచి కోపంగా వెళ్ళిపోయింది కమల.

కూతురి కోపానికి అర్థం తెలిసిన భ్రమరాంబ మౌనంగా ఉండడం మినహా మరేమీ చేయలేకపోయింది.

జగన్నాథం, భ్రమరాంబల నలుగురు సంతానంలో కమల మొదటిది. పున్నామ నరకం నుండి తప్పించే పుత్ర సంతానం కావాలని నలుగురు ఆడపిల్లలకు తల్లిదండ్రులు అయ్యారు జగన్నాథం, భ్రమరాంబ. నాలుగో పిల్ల పుట్టిన తరువాత భ్రమరాంబ ఆరోగ్యం బొత్తిగా పాడయ్యింది. దాంతో కొడుకు కావాలనే కోరికకు స్వస్తి చెప్పక తప్పలేదు ఆ దంపతులకు.

చాలీచాలని ఆదాయంతో నలుగురు ఆడపిల్లలకు చదువు చెప్పించేసరికి తల ప్రాణం తోకకు వచ్చినంత పనయ్యింది జగన్నాథానికి.

అలాంటి దిగువ మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన కమలకు చిన్నప్పటి నుండి ఆశలు ఎక్కువే. అత్తెసరు మార్కులతో డిగ్రీ పాసయిన కమలకు కోరికలకేమీ కొదవలేదు. పెద్ద ఉద్యోగస్తుడ్ని చేసుకుని జీవితాన్ని కులాసాగా గడిపెయ్యాలని ఆమె కోరిక. అయితే సామాన్యమైన అందచందాలున్న కమలను చేసుకోవడానికి చిరుద్యోగులు కూడా సుముఖంగా లేకపోవడంతో పాతికేళ్ళు పైబడ్డా ఆమెకు పెళ్ళి కాలేదు.

అలాంటి సమయంలోనే ఆమెకు సూర్యం సంబంధం వచ్చింది.

సూర్యానికి ఇదివరకే వివాహమయింది. అతని మొదటి భార్య నళిని చాలా అందమైంది. నళిని అందచందాలు కొంతమంది సినీ దర్శకుల దృష్టికి వెళ్లడంతో సినిమా ఫీల్డులో ఆమెకు కొన్ని ఆఫర్స్ వచ్చాయి. దాంతో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఆమె సినిమా రంగానికి వెళ్లిపోయింది.

భార్యనుండి చట్టరీత్యా విడిపోయిన సూర్యానికి ఓ పాప. ఆ పాప కూడా సూర్యంతోనే ఉండిపోయింది.

సూర్యంతో వివాహం కమలకు సుతరామూ ఇష్టం లేదు.

''ఏం సూర్యానికేం తక్కువ? అతనితో పెళ్ళి ఎందుకిష్టంలేదు?'' కూతురిమీద మండిపడ్డాడు జగన్నాథం.

''రెండో పెళ్లివాడిని చేసుకోవాల్సిన ఖర్మ నాకేం పట్టలేదు'' కోపంగా చెప్పింది కమల.

నేలవిడిచి సాము చేస్తున్న కూతురిమీద ఒక్కక్షణం జాలిపడ్డాడు జగన్నాథం.

''చూడమ్మా కమలా! నీ తరువాత ఇంకా ముగ్గురు ఆడపిల్లలకు పెళ్ళి చేయాలి. ఈ సంబంధం కాకపోతే నేనీ జన్మలో నీకు పెళ్ళి చేయలేను. అయినా సూర్యానికేం తక్కువ? చక్కగా గవర్నమెంటు ఉద్యోగం ఉంది. రెండో పెళ్ళివాడయినా నీకూ, అతనికి పెద్దగా వయోభేదం లేదు. నా మాట విని ఈ సంబంధం చేసుకో'' మృదువుగా చెప్పాడు జగన్నాథం.

భ్రమరాంబ కూడా కూతురికి నచ్చచెప్పింది.

అయిష్టంగానే పెళ్లికి ఒప్పుకుంది కమల.

పెళ్ళికయితే ఒప్పుకుందిగానీ మనస్సంతా తెలియని ఆగ్రహం. ఆ ఆగ్రహాన్ని ఎవరిమీదా వ్యక్తం చేయలేని నిస్సహాయత. ఇలా అనేక భావాలతో సతమతమవుతోంది కమల.

ఆమె మానసిక భావాలతో సంబంధం లేకుండా నిరాడంబరంగా పెళ్ళి జరిగిపోయింది.

పెళ్లయిన వెంటనే అత్తగారింటికి వచ్చేసింది కమల.

మూడు గదుల ముచ్చటయిన ఇల్లది. సూర్యం తల్లి రాజ్యలక్ష్మి సౌమ్యంగానే కనిపించింది కమలకి.

''సూర్యానికి పెళ్ళి చేసుకోవడం అస్సలు ఇష్టం లేదు. పాపకు తల్లిలేని లోటు తెలియకూడదని మేమంతా నచ్చచెప్పాకే పెళ్లికి ఒప్పుకున్నాడు. నిన్ను కోరేదొక్కటే, పాపను ప్రేమగా చూడకపోయినా ఫర్వాలేదు. సవతి తల్లిలా బాధపెట్టకు'' ఎందుకో చివరిమాట చెప్పున్నప్పుడు గద్గదమయ్యింది రాజ్యలక్ష్మి గొంతు.

విన్నట్టు నటించి తలూపింది కమల.

''అబ్బాయొస్తున్నట్టున్నాడు'' అడుగుల సవ్వడి విని కమలని గదిలో వదిలేసి వెళ్లిపోయింది రాజ్యలక్ష్మి.

గదిలో ఒంటరిగా మిగిలిపోయింది కమల.

సూర్యాన్ని చూడగానే చప్పున నిలబడింది కమల.

సూర్యం చేతిలో ముద్దులొలికే మూడేళ్ళ అందాల పాప. మంచి ఫ్రాకులో అందంగా, ముద్దుగా వుంది. చక్రాల్లాంటి కళ్లతో కమలకేసి కుతూహలంగా చూస్తోంది.

''మనలో మనకు ఫార్మాలిటీస్ వద్దు'' కమలను తన పక్కనే కూర్చోబెట్టుకుంటూ మృదువుగా చెప్పాడు సూర్యం.

సిగ్గుతో తలూపింది కమల.

''అమ్మ దగ్గరకు వెళ్ళు'' పాపను కమలకు అందించాడు సూర్యం.

అయిష్టంగానే పాపను దగ్గరకు తీసుకుంది కమల.

సూర్యం సమక్షం పెళ్ళిపట్ల అయిష్టాన్ని తగ్గిస్తుంటే పాప సమక్షం ఆ అయిష్టాన్ని వేయింతలు చేస్తున్నట్లు అనిపించింది కమలకు.

''అమ్మా! మా కూలుకు వత్తావా?'' కమల మనసులోని ద్వేషాన్ని తెలుసుకోలేని పాప అమాయకంగా ప్రశ్నించింది.

''అమ్మా! కూలుకు నానమ్మ వద్దు. నువ్వేదా. నాకు పెగన్నం ఒద్దు. అప్పచ్చి తీచుకుదా.''

కమలేమీ మాట్లాడకపోవడంతో పాపే వచ్చీరానీ మాటలతో తన మనసులో భావాల్ని చెప్పింది.

తన కడుపున పుట్టని బిడ్డ 'అమ్మా' అని పిలుస్తుంటే ఒళ్లంతా కారం రాసుకున్నట్లు అనిపించింది కమలకు. కానీ సూర్యం ముందు ఏమీ అనలేక మౌనంగా ఉండిపోయింది. 'తమ మధ్య పాప లేకపోతే ఎంత బాగుండేది?' అన్న భావన ఆమెలో మహావృక్షంలా పెరిగిపోయింది.

''చూస్తున్నావుగా పాప తల్లి ప్రేమ కోసం ఎంతగా

**ఒక్క బిడ్డను కూడా సరిగ్గా పెంచే శక్తి లేకపోయినా కొడుకు కావాలని నలుగురు బిడ్డలని కన్న నీ తల్లిదండ్రుల అసమర్థత అందుకు కారణం. పాతికేళ్ళ జీవితంలో నీకంటూ ఏ ప్రత్యేకతా సంపాదించుకోలేని నీ అసమర్థత అందుకు కారణం. ఒకవేళ ద్వేషించాలనుకుంటే నీ తల్లిదండ్రులనూ, నీ అసమర్థతనూ ద్వేషించు. అంతేకానీ, నీకీ మాత్రం అదృష్టాన్నయినా కలిగించిన పాపను ద్వేషించకు'' కఠినంగా చెప్పింది రాజ్యలక్ష్మి.**



అలమటించిపోతోందో. అయినా ఇహ పాప గురించి దిగులు పడాల్సిన అవసరంలేదు. నువ్వొచ్చేసావుగా. ఇన్నాళ్ళూ అమ్మే పాపను కంటికి రెప్పలా కాపాడింది. ఇహ ఆ బాధ్యత నీదే'' నిశ్చింతగా చెప్పాడు సూర్యం.

''చూడమ్మా కమలా! ఇన్నాళ్ళూ పాపకు అన్నీ నేనే అయ్యి పెంచాను. కోడలొచ్చింది కదా ఇహనయినా మనం పల్లెకు పోయి కాస్త స్వచ్ఛమైన గాలి పీల్చుకుందాం అని మీ మామయ్యగారు ఒహటే గొడవ. ఆయనన్న మాటల్లోనూ నిజం వుందికదా. అందుకే మేము మన ఊళ్ళో ఇంటికి వెళ్తున్నాం. అలాగనీ మిమ్మల్ని ఎప్పటికీ వదిలేసి వెళ్ళడంలేదు. వీలయినప్పుడల్లా వచ్చిపోతుంటాం. నా కోరిక ఒక్కటే పాపను కన్నబిడ్డలా చూసుకో'' వారంరోజుల తరువాత ఊరికి వెళ్తూ వెయ్యి జాగ్రత్తలు చెప్పింది రాజ్యలక్ష్మి.

ఎందుకో ఇల్లంతా తన స్వంతం అయిన ఫీలింగ్ కలిగింది కమలకు.

రోజూ ఉదయం తొమ్మిదికల్లా పాప స్కూలుకు వెళ్లిపోతుంది. మరో గంటకు సూర్యం ఆఫీసుకు వెళ్లిపోతాడు. తిరిగి సాయంత్రం నాలుగు గంటలకు పాప ఇంటికి వచ్చేవరకూ కమలకు బోలెడంత తీరిక.

ఇన్నాళ్ళూ చాలీచాలని ఆదాయంతో నలుగురు ఆడపిల్లల మధ్య ఏ కోరికలు తీరకుండా పెరిగిన కమలకు అత్తగారిల్లు స్వర్గంలా కనిపిస్తోంది. చేతినిండా డబ్బు, కోరినంత స్వేచ్ఛ. ఇదేమిటని అడిగేవారెవరూ లేకపోవడంతో ఆమెకు అడ్డూ అదుపూ లేకుండాపోయింది. సూర్యం పొద్దుననగా బయటకు వెళ్తే తిరిగి ఏ రాత్రికో చేరుకుంటాడు. ఫ్రెండ్స్ సర్కిల్ ఎక్కువ అతనికి. పాప కమల సంరక్షణలో సంతోషంగా వుందని అతని భావన. అందుకు తగ్గట్టుగా కమల కూడా సూర్యం ముందర పాపను బాగానే చూసుకుంటుంది.

★★★

''అమ్మా పాలు'' స్కూలు నుండి రాగానే కమల దగ్గరకు వచ్చి జాలిగా అడిగింది పాప.

''ఇప్పుడు కాదు వెళ్లి ఆడుకో'' కఠినంగా చెప్పింది కమల.

కమల కాఠిన్యానికి బెదిరిపోయింది పాప. బిక్కముహంతో అక్కడ్నుంచి వెళ్లిపోయింది.

పులిపాక కనకదుర్గ

పాప విచారాన్ని చూస్తుంటే ఎందుకో తెలియని సంతోషం కలిగింది కమలకు. ఇన్నాళ్ళూ మనసులో గూడుకట్టుకున్న ద్వేషం, ఆగ్రహం వ్యక్తం చేయడానికి బలి పశువులా ఓ కసుగాయ దొరికింది ఆమెకు.

ఆ రోజు సూర్యం పెందరాళే ఇంటికి చేరుకున్నాడు.

''ఏమిటో విశేషం ఈవేళ దొరగారు త్వరగా వేంచేసారు'' భర్తకు కాఫీ అందిస్తూ మురిపెంగా అడిగింది కమల.

''వచ్చే పండక్కి నీకూ, పాపకు బట్టలు తీసుకుందామని. అది సరే పాప ఏది?'' కళ్లతో పాపకోసం అన్వేషిస్తూ చెప్పాడు సూర్యం.

పాప ప్రస్తావన రాగానే కమల ముఖంలో రంగులు మారాయి.

''ఈ దరిద్రపు ముఖానికి తిండికి, చదువుకు బోలెడు ఖర్చవుతోంది. ఇంకా కొత్త బట్టలొక్కటే తక్కువ?'' మనసులో కసిగా అనుకుంది.

పైకి మాత్రం మొహానికి చిరునవ్వు పులుముకుని ''ఈ మాత్రానికి మీరెందుకు? రేపు పాపకు ఒక్క పూటే స్కూలు. నేనూ పాపా రేపు మధ్యాహ్నం వెళ్లి బట్టలు కొనుక్కొచ్చుకుంటాం'' తీయగా చెప్పింది. అసలు

పాపకు కొత్త బట్టలు కొనే ఉద్దేశ్యం కమలకు లేదు.

''అది సరే ఇంతకీ పాప ఎక్కడ?'' బట్టలు కొనడానికి కావాల్సిన డబ్బు కమలకు అందిస్తూ మరోసారి అడిగాడు సూర్యం.

గత్యంతరంలేక బయట ఎక్కడో మట్టిలో ఆడుకుంటున్న పాపను సూర్యం దగ్గరకు తీసుకొచ్చింది కమల.

పాపను చూసిన సూర్యం ఒక్కసారి తెల్లబోయాడు.

బొద్దుగా, అందంగా వుండే పాప సన్నగా, ఎంతో బలహీనంగా తయారయ్యింది. తండ్రిని చూడగానే సంతోషంగా దగ్గరకు రావడానికి బదులు కమలను చూసిన భయంతో గుమ్మం దగ్గరే ఆగిపోయింది.

ఒక్క ఉదుటున దగ్గరకెళ్లి పాపను ఎత్తుకున్నాడు సూర్యం.

''ఏంటి పాప ఇంతలా పాడయిపోయింది?'' కోపంగా ప్రశ్నించాడు.

''అదేనండీ నాకూ అర్థం కావడంలేదు. అక్కడికీ రెండు పూటలా నేనే పాపకు అన్నం తినిపిస్తున్నాను'' అమాయకత్వం నటిస్తూ చెప్పింది కమల.

ఏం చేయాలో తోచక పాప మొహంలోకి చూస్తుండిపోయాడు సూర్యం.

తాను 'అమ్మా' అని పిలుస్తున్న వ్యక్తి తనకు సవతి తల్లనీ, ఆమెకు తనమీద కాస్తయినా కనికరంలేదనీ, ఎప్పుడో అడుగుబొడుగు మిగిలిన నాలుగు మెతుకులు తన మొహాన విదిలిస్తుందనీ, పాలు కావాలని, బిస్కెట్లు కావాలని మారాం చేస్తే వీపు చిట్లగొడ్తుందనీ చెప్పగలిగే వయసు పాపకు లేదు.

పాపకు తెలిసిందల్లా ఒకటే అంతులేని భయం.

★★★

సూర్యం దగ్గరనుండి ఉత్తరం వచ్చినప్పట్నించి రాజ్యలక్ష్మి మనసు మనసులో లేదు.

''అసలే తల్లి ప్రేమ ఎరుగని పిల్ల ఎలా వుందో?'' అని మనసంతా తెలియని దిగులు.

ఉరుకులు పరుగులమీద పాప దగ్గరకు బయలుదేరింది రాజ్యలక్ష్మి.

ఇంటికి చేరేసరికి అక్కడి దృశ్యం హృదయవిదారకంగా ఉంది.

పాపను పట్టుకుని విపరీతంగా కొడుతోంది కమల. అసలే బలహీనంగా వున్న పాప దెబ్బలు భరించలేక గుక్కపట్టి ఏడుస్తోంది.

''కమలా ఆగు. ఏమిటది?'' గభాలున పాపను కమల చేతుల్లోంచి విడిపిస్తూ ఆవేశంగా అంది రాజ్యలక్ష్మి.

రాజ్యలక్ష్మిని చూసి ఒక్కక్షణం గతుక్కుమంది కమల.

మరుక్షణంలో సంభాళించుకుని కోపంగా చెప్పింది ''చూడండి మీ మనవరాలి నిర్వాకం. బంగారంలాంటి ఫ్లవర్‌వాజ్‌ని ఎలా పగులగొట్టిందో?''

నేలమీద ముక్కలయిన ఫ్లవర్‌వాజ్‌ని లిప్తకాలం చూసి మొహం తిప్పేసుకుంది రాజ్యలక్ష్మి.

''అయితే మాత్రం పసిదాన్ని అంతలా కొట్టడానికి నీకు చేతులెలా వచ్చాయి?'' పాపను దగ్గరకు తీసుకుంటూ కోపంగా అంది.

''బాగుంది. తప్పు చేస్తే దండించక నెత్తికెక్కించుకుంటామా?'' ఎలాగూ తన విషయం రాజ్యలక్ష్మికి తెలిసిపోయింది కదా అని నిర్భయంగా చెప్పింది కమల.

''అదే పాప నీ కడుపున పుట్టిన బిడ్డయితే ఇలాగే ప్రవర్తించేదానివా?'' సూటిగా ప్రశ్నించింది రాజ్యలక్ష్మి.

పాప మాత్రం గట్టిగా వాదిస్తున్న కమలను చూసి భయంతో నాయనమ్మ మెడ ఒంపులో మొహం దాచుకుంది.

రాజ్యలక్ష్మికి ఒక్కసారి కళ్లల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

పాపను ప్రేమగా గుండెలకదుముకుని అంది ''ఎంతయినా సవతి తల్లి తల్లి కాలేదని మరోసారి నిరూపించావుకదా!''

''అనండి నన్నే అనండి. రెండో పెళ్ళివాడిని పెళ్లి చేసుకుని నా జీవితాన్ని నాశనం చేసుకున్నా నామీద మీ అందరి పగ ఇంకా చల్లారలేదన్నమాట. అయినా ఈ పిల్ల రాక్షసికి నేనెందుకు చెయ్యాలి? మా భార్యాభర్తల మధ్య పానకంలో పుడకలా ఉండడానికి ఈ దెయ్యానికి ఏ హక్కు వుంది?'' మనసులో ద్వేషాన్నంతా వెళ్ళగక్కింది కమల.

కమల మనసేమిటో అర్థమయింది రాజ్యలక్ష్మికి.

''కమలా! పాప హక్కుల గురించి మాట్లాడే హక్కు నీకు లేదు. నీవిక్కడికి రాకముందే పాప ఈ ఇంటికి వారసురాలు. అసలు పాప కోసమే సూర్యం నిన్ను పెళ్లి చేసుకున్నాడు. పాపే లేకపోయినట్లయితే ఏ ప్రత్యేకతాలేని నీలాంటిదాన్ని చేసుకోవాల్సిన అగత్యం సూర్యానికి లేదు. పాతికేళ్లొచ్చినా పెళ్లికాని నీలాంటి పేదింటి అమ్మాయిని కోడలిగా తెచ్చుకుంటే కనీసం కృతజ్ఞతతో అయినా పాపను ప్రేమగా చూసుకుంటావని ఆశపడ్డాను. నీకీ ఇంట్లో స్థానం దొరకడానికి కారణమయిన పాపను బాధపెట్టడానికి నీకు మనసెలా ఒప్పింది?''

రాజ్యలక్ష్మి మాటలకు కమలకు నోరు పెగల్లేదు.

కమలేమీ మాట్లాడకపోవడంతో రాజ్యలక్ష్మే తిరిగి మాట్లాడింది.

''చూడు కమలా! రెండో పెళ్లివాడిని చేసుకోవడం వల్ల నీ జీవితం నాశనం అయ్యిందనుకుంటే అందుకు పాప ఎంతమాత్రం కారణంకాదు. ఒక్క బిడ్డను కూడా సరిగ్గా పెంచే శక్తి లేకపోయినా కొడుకు కావాలని నలుగురు బిడ్డలని కన్న నీ తల్లిదండ్రుల అసమర్థత అందుకు కారణం. పాతికేళ్ళ జీవితంలో నీకంటూ ఏ ప్రత్యేకతా సంపాదించుకోలేని నీ అసమర్థత అందుకు కారణం. ఒకవేళ ద్వేషించాలనుకుంటే నీ తల్లిదండ్రులనూ, నీ అసమర్థతనూ ద్వేషించు. అంతేకానీ, నీకీ మాత్రం అదృష్టాన్నయినా కలిగించిన పాపను ద్వేషించకు'' కఠినంగా చెప్పింది రాజ్యలక్ష్మి.

కళ్ళకున్న పొరలేవో తొలగినట్లయింది కమలకు.

నిజమే! తల్లిదండ్రులమీద కోపాన్ని, సమాజంమీద ద్వేషాన్ని నిష్కారణంగా పాపమీద చూపించింది. పాపకున్న హక్కులను కాలరాయాలని చూసింది. తనలో తల్లిని చూడాలని పాపెంత ఆరాటపడిందో తానంతగా పాపను ద్వేషించింది. తనకసలు నిష్కృతి వుందా? పశ్చాత్తాపంతో కుమిలిపోయింది కమల.

''అత్తయ్యా! నన్ను క్షమించండి. ఇహనుంచి పాపను నా కన్నబిడ్డలా చూసుకుంటాను. సవతి తల్లి తల్లి కాగలదని నేను నిరూపిస్తాను'' దీనంగా అంది కమల.

''ఒకసారి పాపను నీ దగ్గర వదిలి ఎంత పొరపాటు చేశానో నాకర్థం అయింది. నువ్వెంతగా మారినా పాపను నీ దగ్గర వదలలేను. ఇహనుంచి నేను కూడా ఇక్కడే ఉండి పాప ఆలనాపాలనా చూసుకుంటాను' దృఢంగా చెప్పింది రాజ్యలక్ష్మి.

''పాపా! నన్ను క్షమించమ్మా. నిష్కారణంగా నిన్ను బాధపెట్టాను. ఎవరెవరిమీదో వున్న కోపాన్ని ఏ పాపమూ ఎరుగని నీమీద చూపించాను. ఈ ఇంట్లో నీకన్ని హక్కులు వున్నాయమ్మా. ఇంకెన్నడూ నిన్ను బాధపెట్టను'' సజల నయనాలతో అనుకుంది కమల.

ఆ సాయంత్రం–

''అత్తయ్యా! నేను బయటకు వెళ్తున్నాను. ఓ గంటలో తిరిగివస్తాను'' చెప్పులేసుకుని బయటకు వెళ్తున్న కమలను 'ఎక్కడికన్నట్లు' చూసింది రాజ్యలక్ష్మి.

''పండక్కి నన్నూ, పాపని బట్టలు కొనుక్కోమని ఆయన డబ్బులిచ్చారు. పెళ్ళికి కొన్న చీరలు నాకు చాలానే వున్నాయి. అందుకే మొత్తం డబ్బుపెట్టి పాపకు మంచి ఫ్రాకులు, బొమ్మలు తీసుకొస్తాను'' రాజ్యలక్ష్మి చూపులోని ప్రశ్నకు సమాధానం చెప్పి బయటకు నడిచింది కమల.

ఏమర్థం అయ్యిందో పాప సంతోషంగా కిలకిలా నవ్వింది.

☆

